# ఆశయానికి అడ్డుగోడలు

ఉమళ్ళదిన్నె పద్మశ్రీ

"సోదరీ మణులారా' ఈ నాటి యువకులు కట్నపిశాచి కబంద హస్తాల్లో ఎలా నలిగి పోతున్నారో నేను కొత్తగా వివరించ నవసరంలేదు రోజూ ప్రొద్దున్నే మనం ఎన్నో వార్తలు వింటున్నాం అందులో తొంభై శాతం కట్నం గురించిన చావులూ, ఆత్మహత్యలే, ఈ కట్న పిశాచాన్ని పారద్రోలాలంటే నా ఒక్కదానివల్లనే అవుతుందా' అని ప్రతి ఒక్కరూ వెనుకంజ వేస్తున్నారు కానీ అలా బావించకండి ప్రతి ఒక్క మనిషి కలిస్తేనే అది సంఘం అలాగే ఒక్కొక్క నీటి చుక్క కలిస్తేనే అది నదిగాను, పెక్కు నదులు కలిస్తేనే అది సముద్రంగాను అవుతోంది కాబట్టి మనమందరము కలసి కట్టుగా నిలబడాలి మన చదువులయి పోగానే మన మందరము విడిపోతాము కానీ మనమందరమూ ఒక విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి 'కట్నం తీసుకునే మగవాణ్ని నేను పెళ్లి చేసుకోను' అని

మరి స్త్రీని పెళ్లాడుతారా? ఎవరో యువకుడు విసిరిన కొంటి ప్రశ్న సుమిత్ర వాక్ప్రవాహానికి అడ్డుపుల్ల వేసింది

అంతా పెద్దపెట్టున నవ్వేసారు ఒక్కసారిగ

ఎఱ్ఱబడిన మొహంతో ఒకసారి ఆడియన్సు వేపు చూస్తూ ఆ అన్న వారెవరో ఒక లక్షరూపాయల డబ్బు యిస్తానన్న పురుషుణ్ని పెళ్ళాడగలరా? కొద్ది క్షణాలాగి మరలా అంది సుమిత్ర

ఒక ఎడ్యుకేటెడ్ అయిఉంటే రేపు బాధ్యతకల పదవులు చేపడూ కూడ, బావి బారత పౌరులం అని నినాదాలు చేసే యువకునికి, యిలా అసంబద్ధమైన మాటలు మధ్యలో మాట్లాడకూడదనే చిన్న విషయం కూడ తెలియనందుకు నేను చాలా చింతిస్తున్నాను మీరు మాట్లాడదల్చుకుంటే వచ్చి ఈ డయాస్ మీదే మాట్లాడవచ్చు"

ఆడియన్స్‌లో ఎవరూ కిక్కురమనలేదు ఇంతకు ముందర నవ్వినవారు కూడ ఏం మాట్లాడలేదు ఆ తర్వాత కొద్ది క్షణాల్లోనే సుమిత్ర తన ప్రసంగం కానిచ్చి కిందకు దిగింది రెండు నిమిషాల పాటు హాలంతా చప్పట్లతో కదిలిపోయింది యువతులందరూ సుమిత్ర చుట్టు గుమిగూడారు

హాయ్ సుమిత్రా, ఎక్సలెంట్, సూపర్బ్

చాలా కరక్టుగా చెప్పావ్ నువు చెప్పినట్లే అందరూ ఉంటే త్వరలోనే కట్నం అనే మాటే మర్చిపోయేలా చెయ్యొచ్చు, అని ఒకరు

అబ్బా నువ్వింతలా ఆవేశ పడతావనుకోలేదు మన మేడమ్స్ కూడ ఎంత మెచ్చుకొన్నారో, అని ఒకరు

కరక్టుగా దెబ్బకొట్టావే, మానవుడు నోరెత్తలా మళ్లీ అని యింకోళ్ళు యిలా, గోల గోలగా మాట్లాడేస్తున్నారు సుమిత్రతో అందరూ

ఆ రోజు డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'వరకట్నం' మీద వక్తృత్వ పోటిలో సుమిత్రకు ప్రదమ బహుమతి వచ్చినట్టు ప్రిన్సిపాల్ అనౌన్స్ చేసారు

ఎంతో సంతోషంతో షీల్డ్ అందుకుంది సుమిత్ర మరోసారి హాలంతా క్లాప్స్‌తో మారుమ్రోగింది

★ ★ ★ ★ ★ ★

నాన్నగారూ సంతోషంతో గట్టిగా పిలుస్తూ లోపలికొస్తున్న సుమిత్రని చూసి చెయ్యూపుతూ

తెల్సిందమ్మా, తెల్సింది నీకు ఈ రోజు డిబేట్స్‌లో ఫస్ట్ ప్రయిజ్ వచ్చింది అవునా అన్నారు ఆనందరావుగారు

నీకపుడే ఎలా తెల్సిందబ్బా అంటూ ఆశ్చర్యం నటిస్తున్న సుమిత్ర దృష్టిలో ఆదిత్య పడగానే వోహో, యిది తమరి చలవా అంటూ షీల్డ్ బల్లమీద పెట్టింది

తల్లి అందించిన కాఫీ తాగుతూ ఆఁ ఏవిటి పట్టువదలని విక్రమార్కా, తమరి ఉద్యోగ విజయాల గూర్చిన విశేషాలు వివరించగలరా' ఆదిత్యవంక చూస్తూ అంది సుమిత్ర

సరదాగా అడిగినా కూడ సుమిత్ర మాటలకి ఆదిత్య మొహంలో విచారరేఖలు అలుముకున్నాయి

నీకు తెలీందేముంది సుమిత్రా మామూలే ఎక్కడి ఉత్తర దక్షిణాల మాటలు తప్పితే మెరిట్ సంగతి ఎవరు పట్టించుకుంటున్నారు చెప్పు అయినా యిపుడి విషయం ఎందుకాని నీ ప్రసంగం సంగతి చెప్పి మా వీనులకు విందు చేయండి సుమిత్రా దేవిగారూ పోయిన ఉత్సాహాన్ని కొని తెచ్చుకుంటూ అన్నాడు ఆదిత్య

కొత్తగా మాట్లాడతావేంటి బావా మనిద్దరివీ ఒకే రకమైన బావాలు అని నీకు తెల్సుకదా ఎంతైనా నేనదృష్టవంతురాల్ని నేను ఈనాడు ఏదో ఆవేశంలో అంటున్నాననుకుంటున్నావేమో కానీ కానేకాదు నేను నా బావాల కనుగుణంగా నా జీవితాన్ని మలుచుకుంటాను నేను చాలా ప్రాక్టికల్‌గా ఆలోచించేదాన్ని, మాట్లాడేదాన్ని

మళ్లీ ఆవేశంతో మాట్లాడుతున్న సుమిత్ర ఎఱ్ఱబడిన మొహం చూస్తూ అన్నాడు ఆదిత్య–

కూల్ డౌన్ సుమిత్రా, ఏంటి యిక్కడే పెద్ద ఉపన్యాసాలిచ్చేస్తున్నావు ఇపుడు నీ బావాలకి వ్యతిరేకంగా ఎవరన్నారని అంతలా ఆవేశ పడుతున్నావ్? సాధ్యమయినంత వరకు స్త్రీలకి హెల్పింగ్‌గానే ఉంటాను నా కళ్లెదుట ఏ స్త్రీ కూడ అవమానింప బడటం నా కిష్టంలేదు అలాగే స్త్రీలని పట్టి పీడిస్తున్న ఈ కట్నాన్ని నేను సమూలంగా నాశనం, చేయలేక పోయినా, నా చేతిలో ఉన్న పనిగా, చంద్రునికో నూలుపోగులా నామటుకు నేను కట్నం తీసుకోను నేను నీలాగా ఉపన్యాసాలు యిచ్చి పదిమందినీ ప్రోత్సహించ లేకపోవచ్చు నినాదాలు చేయలేక పోవచ్చు, కానీ ఆచరణలో చూపిస్తాను

అబ్బబ్బా, ఏమిట్రా మీ గోల రోజూ ఉండేదేగా వినలేక చస్తున్నా ఏమండీ ఓ మాటు యిలా రండి అంటూ వచ్చిన సుబద్రమ్మగారి మాటలకు యిద్దరూ నవ్వుతూ చర్చ ఆపారు

ఇలా అయితే లాబం లేదే, యింక వీరిద్దరికీ ముడిపెట్టెయ్యాల్సిందే, తప్పదు అంటూ వచ్చిన ఆనందరావుగారితో అయితే నాకు వాక్స్వాతంత్రం యింకెన్నాళ్లో లేదన్నమాట అంటూ జోక్ వేసాడు ఆదిత్య

ఆదిత్య ఎమ్మే ఫస్ట్‌క్లాసులో ఈ మధ్యే పాసయాడు తండ్రిని చిన్నతనంలోనే పోగొట్టుకున్న దురదృష్టవంతుడు చిన్నతనంనుండీ తల్లే అన్నీ అయి పెంచి పెద్దచేసింది తండ్రి మిగిల్చిన ఆస్తి ఆదిత్య ఎమ్మే చదువు అయేవరకు అతికష్టంమీద లాక్కొచ్చింది ఆదిత్యతల్లి సుగుణమ్మ అన్న సహాయం చేస్తానన్నా అబిమానంతో నిరాకరించిన సుగుణమ్మకి యిపుడిపుడే అది తప్పేటట్టు అన్పించట్లేదు యింకో ఏడాది ఆదిత్య యిలాగే ఉంటే తను అన్న ముందర చేయిచాపక తప్పదు ఈ లోపలే దేవుడు కరుణించి ఆదిత్యకి ఉద్యోగం చూపిస్తే బాగుండు' అని ఆవిడ రోజూ వంద సార్లయినా అనుకుంటూ ఉంటుంది

అస్తంతా కరిగిపోగా ఉండటానికి చిన్న పెంకుటిల్లు మాత్రం మిగిలింది అప్పటికి ఆదిత్య యేదో చిన్న ఉద్యోగాలకి ట్రైచేస్తూనే ఉన్నాడు అవి దొరికినట్టే దొరికి కొద్దిరోజుల్లోనే వూడిపోవడం జరుగుతోంది

* * *

కాలప్రవాహంలో మూడేళ్ళు గడిచిపోయాయి తుమ్మితే వూడిపోయే ముక్కులాంటి వుద్యోగాలతో నానా అవస్థా పడుతున్నాడు ఆదిత్య రాను రాను జీవితమంటే నిరాశా నిస్పృహలు ఆవరిస్తున్నాయి అతనిలో ఈ మద్యే చేరిన చిన్న వుద్యోగం కూడా పోయింది కారణం మామూలే ఒకచోట కుల పట్టింపయితే, ఒకచోట డబ్బుదగ్గిర గొడవ ఇంకోచోట అవినీతి ఇలా ఎన్నో అవాంతరాలు అతన్ని ఏ ఉద్యోగంలోను స్థిరంగా ఉండనీటం లేదు ప్రస్తుత ఉద్యోగం ఊడటానికి కారణం ఆ సంస్థ అదికారి మరదలికి యింట్లో ఏమీ తోచకపోవటం అది ఆదిత్య పాలిటి శాపంలా ఆ ఉద్యోగం నుండి బయటపడేస్తే యింట్లో ఏమీ తోచని ఆ మరదలు ఎల్లకి మటుకు చక్కని కాలక్షేపం అయింది

ఇంటికి వస్తే ఎటువంటి పరిస్థితుల్ని చూడాల్సొస్తుందో అని ఆదిత్య బయం దీనంగా ఉండే తల్లి మొహం, పదేళ్లయినా కలర్లు కాదు కదా కనీసం సున్నం మొహం కూడ చూడని యింటిని చూడాలంటే, ఆదిత్యలో ఒక విదమైన ఆవేదన, బయమూను

ఇపుడిపుడే మావయ్య దగ్గర డబ్బు తీసుకుంటూ ఉండటంవల్ల ఆయన్ని చూడాలన్నా మొహమాటం ఎటొచ్చీ మండు వేసవిలో చల్లటి గాలిలాగా సుమిత్ర ఒక్కతే అతనికి పెద్ద ఓదార్పుగా అన్పిస్తూంటుంది

ఆలోచనల్లోనే ఆనందరావు యింటిని సమీపిం చాడు ఆదిత్య గేటు తీసుకొని లోపలి కొస్తున్న ఆదిత్యని చూసికూడ తల తిప్పుకుని పక్కవాళ్లతో మాట్లాడ్డంలో పడ్డారు సుబద్రమ్మగారు ఈ రకమైన నిరసనకు ఈ మద్యే అలవాటు పడుతున్నాడు ఆదిత్య లోపలి కొచ్చి కుర్చీలో కూలబడి టీపాయ్ మీదున్న పేపర్ అందుకని తిరగేస్తున్నాడు పేపర్ పట్టుక్కూర్చున్నాడే కానీ ఆలోచనలు వదలట్లేదు ఆదిత్యని ఇదే ఇదివరకయితే సుబద్రమ్మగారి ట్రీట్‌మెంట్ ఇలాగే ఉండేదా? తన్నంత దూరంలో చూస్తూనే సుమీ, ఆదిత్య వచ్చాడే అని ఓ కేకపెట్టి రా నాయనా, రా ఏంటిన్నాళ్లక్కనిపించావూ, అంటూ ఆహ్వానించేది తను సుమిత్రకోసం కళ్ళు తిప్పేంతలోనే కాఫీ కప్పుతో ప్రత్యక్షమయ్యేది కానీ ఈనాడా అబిమానమంతా ఏమయింది ప్చ్ అనుకుంటూ బలవంతాన పేపర్‌వేపు దృష్టి మళ్లించాడు ఆదిత్య అతని దృష్టి దానిమీద నిలవనీయకుండానే మళ్ళీ గట్టిగా మాటలు విన్పించాయి ఆ అవును మా ఆడపడుచు కొడుకే ఉద్యోగమూ, పాడా ఇంతవరకూ ఏమీలేదు అయినా నిలకడ ఉండాలండి దేనికయినా" అంటున్నారు సుబద్రమ్మగారు

చాలా మారిపోయాడే పాపం ఏదైనా అనారోగ్యమా?" అవతలావిడ అడుగుతోంది ఉత్సుకతతో అనారోగ్యమేమీలేదు అయినా ఆ అబ్బాయి ఉండేదే అలాగండి చిన్నప్పటినుండి సన్నవిడితనం" అవతలావిడ ఏదో అడుగుతోంది సుబద్రమ్మగార్ని

ఆ, ఈ రోజుల్లో అన్నీ పిల్ల చేష్టలమ్మా 'మందేముంది మా సుమి ఏమంటే అదే దానిష్టమే మా ఇష్టం చిన్నప్పటినుండే బావా మరదళ్ళు, బార్యాబర్తలు అని చెప్పటానికి మనతరంకాదు కదండీ యిది ఇప్పుడు ఎవరి అబిప్రాయాలు



వాళ్ళవి" వింటున్న ఆదిత్య నిర్ఘాంతపోయాడు ఆ మాటలకి ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి అంటున్నారే, మరి చిన్నప్పటినుంచీ మా ఇద్దరి మధ్యా ఈ రకమైన బావాలు కలగచేసింది ఎవరోకాదు ఈ అత్తయ్యేకదా మొన్నటి దాకా దొరబాబులా ఉంటాడు మా ఆదిత్య కేమండీ మా ఆదిత్య సుమిత్ర వెళ్తూంటే చూడ్డానికి రెండు కళ్ళు చాలవ్' అంటూండేదే యింతలోనే ఎంత మార్పు అవును తనింతవరకూ గమనించలేదు సుమిత్రలో కూడా ఈమధ్య మార్పు వస్తోంది అది ఇలాంటిదే అని తను గ్రహించలేకపోయాడు తనకి ఉద్యోగం రానందుకు ఆమె కూడా అంతలా దిగులుపడుతోంది అనుకున్నాడే తప్ప ఆ ముభావానికి కారణం యిదని ఇప్పటిదాకా తెలియలేదు తనకి ఆదిత్య మనసులో సున్నితమైన గాజుపలక జారి క్రిందపడి బళ్ళున ముక్కలైన పీలింగ్ ఆలోచించడానికింకేమి లేనట్టుగా ఖాళీ అయిపోయింది మనసు శూన్యం లోకి చూస్తున్నట్టుగా లేచి నిలబడ్డాడు ఆదిత్య యింటికి వెళ్ళడానికి ఉద్యుక్తుడవుతూ మాటలు చాలించి లోపలికొస్తూ అన్నారు సుబద్రమ్మగారు. సుమిత్ర స్కూల్ కెళ్ళింది ఆలస్యం అవుతుందీ రోజు అన్చెప్పింది యిప్పటికే ఎక్కువ మాటాడేశాను అన్నట్టుగా ఆవిడ అన్నతీరుకి ఆదిత్యలో నిర్లిప్తత ఆవరించింది ఆవిడమాటలో ఆలస్యం అవుతుందిగా నువ్వింకెళ్ళు' అన్నబావం కన్పించింది ఆదిత్యకి ఎంత విచిత్రం ఇదే యిదివరకైతే ఎలాగూ యింతసేపున్నావుగా ఉండు నాయనా అన్నబావం తనకి కన్పించేది యివే మాటల్లో కానీ ఈనాడు అలా లేదెందుకో అంటే మనుషుల స్వబావాలు తెలిస్తే వాళ్ల మాటల్లో అర్థాలు కూడా మారిపోతుంటాయ్ అన్నమాట- పేలవంగా లేదత్తయ్యా వెళ్ళాలి చిన్న పనుంది అంటూ బయటపడ్డాడు ఆదిత్య తనలో అతి సున్నితమైన బాగం ఏదో పన్చేయడం మానేసినట్టు అన్పించింది అతనికి సందు మలుపులో కన్పించింది సుమిత్ర పక్కనే ఎవరో ఒకతను సుమిత్ర రావడానికి ఆలస్యం ఉంది" మళ్ళీ అత్త మాటలు చెవుల్లో మారుమ్రోగాయి ఆదిత్యకి

# ఆశయానికి అడ్డుగోడలు

'బావా ఈయన సాగర్ ఎల్ ఐ సి లో పన్చేస్తున్నారు' పరిచయం చేసింది సుమిత్ర యాంత్రికంగా విష్ చేశాడు ఆదిత్య వస్తా బావా' ఈయన ఇల్లు కూడా పక్కసందులోనే అని చెప్పి వెళ్ళిపోయింది సుమిత్ర యిదే యిదివరకయితే అంత తొందరేంటోయ్ పద వస్తున్నా బాడీగార్డ్ పని తప్పితే ఇంకేం లేదుగా నాకు పని అంటూ ఆమెని అనుసరించేవాడు తను నిర్లిప్తంగా అడుగులు ముందుకు పడ్డాయి తన ప్రమేయం లేకుండానే

మనసున్న మనిషికి సుఖము లేదంతే ఎక్కడి నుంచో ఒక మహాకవి రాసిన జీవిత సత్యం పాట రూపంగా విన్పిస్తోంది

చిన్నప్పట్నుంచీ వింటున్నా ఈ పాటలో అర్థం యింత బాగా యిప్పటిదాకా తెలియలేదే తనకు అంత నిర్లిప్తతలోనూ ఆశ్చర్యపడ్డాడు ఆదిత్య

★ ★ ★ ★ ★ ★

ఒరేయ్ ఆదిత్యా సుమిత్రకి పెళ్ళి సంబందాలు చూస్తున్నార్ట తెల్సా? తల్లి ప్రశ్నకి నిదానంగా తలెత్తి చూసాడు ఆదిత్య ఆ చూపుకి అర్థం తెలుసు' అన్నట్టుగా ఉంది

అంటే నీకు తెలిసే ఊరుకున్నావన్నమాట సుమిత్ర చిన్నతనం నుంచీ నీ బార్య అనుకుంటూ వచ్చాము ఆ విషయం అందరికీ తెల్సిందే పైగా ఈ మాట వాళ్లంతట వాళ్లే అనే వాళ్ళు కూడ ఇది ఖచ్చితంగా మీ అత్తయ్యకి పుట్టిన బుద్ధే యింకా ఏదో అనబోతున్న ఆవిడ గేటు తీసిన చప్పుడుకి తలెత్తి చూసారు

సుమిత్ర లోపలికి వస్తూ కన్పించింది చిలక పచ్చరంగు చీర, అదే రంగు బ్లౌజ్‌తో ఎంతో అందంగా కన్పించింది ఆవిడ కళ్ళకి కాళ్ళ పట్టీలు సన్నగా చప్పుడు చేస్తూంటే, తలంటి పోసుకున్న జుట్టు మునివేళ్ళతో సవరించుకుంటూ లోపలి కడుగు పెట్టింది సుమిత్ర మంచి తెలుపుతో ఆకర్షణీయంగా ఉండే సుమిత్ర ఆ రోజు యింకా అందంగా కన్పించింది ఆవిడకేపరాయి వాళ్ళ సొత్తు అయిపోతూంటే అవతల వాళ్ళ అందం రెట్టింపుగా కన్పిస్తుందేమో ప్చ్ అయినా యింత అందమైన కోడల్ని తెచ్చుకునే గీత తనకుండద్దూ

ఆలోచనల్లోంచి తేరుకుని రామ్మా రా అంటూ ఆహ్వానించారావిడ

ఆవిడ యింతకు ముందు ఆవేశంగా అన్న మాటలు ఏ గాలికి ఎగిరి పోయాయో పేదవాడి కోపం పెదవికి చేటు అనే విషయం ఆవిడ మర్చిపోలేదు అట్లాంటి చేదు అనుబవాల్తోనే జీవితం గడుస్తూంటె ఎలా మర్చి పోగలదు మరి

కూర్చోతల్లీ ఈ మద్య రావడమే మానేసావే ఆవిడ మాటకి చెప్పింది సుమిత్ర

ఏముంది అత్తయ్యా రోజూ స్కూలూ, నోట్సులు కుస్తీతో సరిపోతోంది సరదాగా చేరినా పని బాద్యతగా చేయాల్సిందేగా అందులో టీచర్ అంటే యింకా ఎక్కువ బాద్యతగా ఉండాలి

ఈ రోజు ఆదివారం కదా అందుకని వీలు చేసుకుని వచ్చానిలా?


మంచి పని చేసావు కానీ బోజనానికిరా ఎల్చారావిడ

లేదత్తయ్యా తినే వచ్చా అంటూ బావవేపు చూసింద

గడ్డం మాసిపోయి నిస్తేజంగా కూర్చున్న ఆదిత్యని చూడగానే ఒక్కక్షణం మనసు ఊగిసలాడింది సుమిత్రకి

ప్చ్ యిదివరకు ఎంత హుందాగా ఉండేవాడు తల విదిలించింది సుమిత్ర ఉహుం యిలాంటి ఆలోచనలు చేయకూడదు మరి సెంటిమెంట్స్‌లోకి వెళ్ళిపోతున్నా తను ఎప్పటికీ ప్రాక్టికల్‌గా ఆలోచించ గలగాలి అంతే అనుకుంటూ 'ఆ' బావా మొన్న ఏదో యింటర్వ్యూ కెళ్ళా అన్నావు ఏమయింది? ఆ అడగడంలో ఆతృత ఏం లేదు రిజల్ట్ ముందరే తెల్సిన విద్యార్థి పేపర్ చూస్తున్నట్టుగా అంది మామూలే ఆదిత్య క్లుప్తంగా అన్నాడు యింక ఉండబట్టలేక అడిగేశారు సుగుణమ్మగారు అమ్మాయ్, నీకేవో సంబందాలు చూస్తున్నార్ట నిజమేనా అని చట్ ఎవరు చెప్పారు నీకు అలా అని నీకు నాకిప్పటిదాకా ఈ విషయం తెలీదే యిది ఆవిడ సుమిత్ర దగ్గరి నుంచి ఆశించిన జవాబు

కానీ సుమిత్ర చాలా నిదానంగా అక్కడే ఉన్న సినిమా బొమ్మల పుస్తకాన్ని పరీక్షగా చూస్తూ అవునత్తయ్యా, నా ఆశయాల కనుగుణంగా కట్నం వద్దనేవాళ్ళు యిద్దరు ముగ్గురు కనిపించారు నాన్నగారికి వద్దు అనడానికి తగిన కారణం కనపడలేదు ఒకతని పేరు ఆం ప్రబాకర్‌ట బేంక్‌లో వర్క్ చేస్తున్నాట్ట అంతా బానే వుంది నాన్నగారికి నచ్చిన సంబందమే కానీ నేనే సంశయిస్తున్నా వాళ్ళమ్మా చెల్లెలు, ఒక తమ్ముడూ యితని దగ్గరే ఉంటార్ట వాళ్ళ నాన్నగారు ఈ మద్యే పోయారు అన్నట్టు మొన్న సాగర్‌గార్ని పరిచయం చేసాను చూడు బావా అతను ఒకడే చెల్లెలుకి పెళ్ళి అయిపోయింది పెళ్ళంటూ జరిగి పోయింది కాబట్టి



మన బాధ్యత అంతగా ఉండదు కదా అతను కట్నాలకి వ్యతిరేకే కట్నం ప్రసక్తే ఉంటే నీతో చెప్పేంతదాకా రాదనుకో?

తనవైపు నుండి తప్పు కనబడకుండా ఉండటానికి కొంచెం ఎక్కువే మాట్లాడింది సుమిత్ర

ఈ మాటలు వినలేనట్టుగా బారంగా లేచి పనున్నట్టు లోపలికెళ్లి పోయారు సుగుణమ్మగారు

చ నువ్వింత సిగ్గు, అభిమానం లేనిదాని వనుకోలేదు సుమిత్రా మనం ఎన్ని కలలు కన్నాం ముందర జీవితాన్ని గురించి నాకు ఉద్యోగం లేదనేగా ఇలా ప్రవర్తిస్తున్నావ్ పైగా యింత ధైర్యంగావచ్చి నా ముందరే ఎవర్ని చేసుకోమంటావ్? అని చాయిస్ అడుగుతున్నావంటే నువ్వెంతటి చ. చ నీతో మాట్లాడ్డం వేస్ట్ లోపల అనుకున్న ఒక్కమాట కూడ పైకన్లేదు ఆదిత్య అది అతని స్వబావానికే విరుద్ధం గతకాలంలో జరిగిన విషయాలు ఆమె అంత ఈజీగా తీసుకుందీ అంటే అక్కడే ఆమె చీప్ మెంటాలిటీ బయట పడుతోంది అలాంటి అమ్మాయి కోసం ఆమె ఎంతటి సౌందర్యవతి కావచ్చుగాక, తాను ఏడుస్తూ దేవదాసులా మారడమనేది అతనికి చాలా అసహ్యకరమైన విషయం

తను ఊహించినట్లుగా ఆదిత్య మండిపడుతూ తన్ని వస్తు బయటికి పో అనకుండా పైగా తను చెప్పిన సమస్యకి పరిష్కారం ఆలోచిస్తున్నట్టుగా కూర్చున్న ఆదిత్యని చూస్తే సుమిత్ర మనసు చెప్పలేనంత అసంతృప్తితో నిండిపోయింది అతడు తన్ని మాటలతో అవమానిస్తే తను ఎదురు తిరిగి నీలాంటి ఉద్యోగం లేనివాణ్ని కట్టుకుని నేనేం చేయాలి మొన్న మొన్నటి వరకూ నిన్నే చేసుకుంటా అన్నాను నిజమేకానీ నీకు ఉద్యోగం లేకపోవటం అనేది ముందర, ముందర చిన్నతనంలో అనుకున్నాంకదా అని భవిష్యత్తునంతా నాశనం చేసుకునేంత అవివేకనికాదు నేను నేను చాల ప్రాక్టికల్‌గా ఆలోచించే మనిషిని అని చెప్పి ఈ విషయంలో తనతప్పు మాత్రం లేదని ప్రూవ్ చేసుకోవాలని సుమిత్ర ఉద్దేశం ఆ అవకాశం యివ్వకుండా చేస్తున్నాడు ఆదిత్య ముఖ్యంగా ఆ ఉద్దేశంతోనే పని గట్టుకొని వచ్చింది సుమిత్ర

ఆదిత్య అంటీ ముట్టనట్టుగా ఉన్నా ఎలాగో రెండు గంటలు గడిపేసి ఇంటికి బయల్దేరింది సుమిత్ర


కానీ ఎవరూ ఊహించని విధంగా సుమిత్ర వచ్చేసిన రెండు రోజులకే అత్యాశ్చర్యకరమైన విషయం ఒకటి తెలిసింది అది ఆదిత్యకి ఉద్యోగం రావటం అదీ అట్లా ఇట్లా జాబ్‌కాదు క్లాస్ వన్ ఆఫీసర్ ఉద్యోగం ఆ ఉద్యోగం వచ్చే ముందరే సెంటర్‌లోని ఒక్కగా నొక్క యిల్లు అమ్మేశాడు అంటే తప్పకుండా యిది లంచం యిచ్చి తెచ్చుకున్నదే అని అందరూ అనుకోవడం కూడా ఆమె చెవుల పడింది

ఎలాగయితేనేం ఆదిత్య బ్రహ్మాండమైన ఉద్యోగం సంపాదించుకున్నాడు అది తనకి కావలసినది

సుమిత్ర హృదయం ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయింది

రిక్షా దిగి ఒక్క పరుగున యింట్లోకి పరిగెత్తిన సుమిత్రకి ఆదిత్య సామాను పాక్ చేస్తూ కనబడ్డాడు 'కంగ్రాచ్యులేషన్స్ బావా' అంటూ ఎక్కడ లేని ఉత్సాహంతోను చెప్పింది సుమిత్ర అంత పెద్దగా చెప్పాల్సిన ఘనకార్యం సాధించలేదులే పురికొస ముడేస్తూ అన్నాడు ఆదిత్య 'ఇంతలో ఎవరది? అంటూ వచ్చారు సుగుణమ్మగారు ఆవిడ మొహం వింత వింత కాంతులతో వెలిగిపోతోంది తన యిరవై అయిదేళ్ళ కష్టానికి ఫలితం యిప్పుడే వచ్చింది మరి అందుకనే ఆ . మొహంలో అంత కాంతి

నువ్వటే అమ్మాయ్, చూడమ్మా సుమిత్రా ఈ అదృష్టం యింకొంచెం ముందరే తలుపు తట్టినట్టయితే బంగారు లాంటి నిన్ను కోడలిగా చేసుకుందును కదా! సుమిత్ర అంతకు ముందు అన్న మాటలు తెలిసి కూడా ఆమె తన బావాల్ని దాచుకోలేక పోయింది కారణం ఆవిడ ఈతరం మనిషి కాకపోవటమేనేమో




యిప్పుడయితే మటుకేం అత్తయ్యా నా కింకా పెళ్ళయి పోలేదుగా చేసేపని ఆపి ఒక్కసారిగా తలెత్తి చూశాడు ఆదిత్య సుమిత్ర మొహం యింతకు ముందు ఏమి జరగనట్టే ఉంది అది గడుసుదనమో లేక అమాయకత్వం నటించడమో అర్థం కాలేదు అతనికి

సుగుణమ్మ గారు కూడా ఒక్కసారి నిశ్శబ్దం అయిపోయి వెంటనే తేరుకుని మరే మరే ఏటిల మీద పెళ్ళిళ్ళు ఎన్నో ఆగిపోయాయి యిదో లెక్కా అంటూ లోపలికెళ్ళి పోయారు రక్త సంబంధం ఆవిడచేత ఆ మాట అనిపిస్తోంది ఆదిత్య ఒప్పుకుంటె బాగుండు ఆవిడ లోపలి కెళ్ళి అనుకుంది

ఆదిత్య తిరిగి తన పనిలో నిమగ్నమయాడు ఏం బావా నా మాట వినలేదా లేక విననట్టు నటిస్తున్నావా 'సుమిత్ర మాటలకి తల వంచుకుని పని చేసుకుంటూనే అన్నాడు ఆదిత్య 50 వేలు కట్నం యిస్తే సరే సుమిత్రా" ఏంటి జోకా కాదు నిజంగానే అంటున్నా

నువ్వెంత ప్రాక్టికల్‌గా ఆలోచించే దానివో దానికి రెండింతలు ప్రాక్టికల్‌గా ఆలోచిస్తాను నేను యిపుడు నువ్విచ్చే యాభైవేలతో నేను రిటైరయి పోయేదాకా అంటే యింకా ముప్పయేళ్ళపాటు సం కి కనీసం నలభైవేలు చొప్పున నువు కనీసం ఇరవై ఏళ్లపాటు అనుభవిస్తావు

ఇంత మానవత్వం లేకుండా ఆలోచిస్తావనుకో లేదు బావా

సుమిత్ర మాటలకి కొంచెం గట్టిగా అన్నాడు ఆదిత్య

సుమిత్రా నీకు మానవత్వం గురించి మాట్లాడే హక్కు ఏమాత్రం లేదు చిన్నప్పట్నుంచీ పెంచి పెద్ద చేసిన తల్లినే నువు మొగుడు నీసొంతం అవగానే, ఆవిడ కొడుకుదగ్గర ఉండకూడదు అనీ, తోడ-బుట్టిన చెల్లెళ్ళ బాధ్యత ఉండగూడదని, కోరుకునే నీకేమాత్రం మానవత్వం ఉంది? పోతే కట్నం గురించి అంటావా అవును చిన్నప్పట్నుంచీ నేను కట్నానికి వ్యతిరేకినే ఆడపిల్లలకి పెళ్ళిళ్ళెంత ముఖ్యమో, మగవాళ్ళకి ఉద్యోగాలంత ముఖ్యం మీరు మీ పెళ్ళి అవటానికి కట్నాలరూపేణా డబ్బు యిస్తే మేము మెరిట్ ఉండి కూడ లంచాల రూపేణా ఉద్యోగాలు కొనుక్కోవాల్సొస్తోంది ఈ కట్నాల పెరుగుదలకి పరోక్షంగా కారణం మీరే లంచం తీసుకుని వచ్చిన మొగుణ్ని ఏస్త్రీ ఆదరించని రోజున తప్పకుండా కట్నాలు తగ్గిపోతాయి నువు ఒక ఆశయాన్ని ఆదర్శంగా పెట్టుకుని అలాగే మెలగాలని ప్రయత్నిస్తున్నావు మంచిదే కానీ ఆ ఆశయసాధన కోసం మానవత్వాన్ని విస్మరిస్తున్నావ్ ఎన్ని చట్టాలు చేసి ఎన్ని మార్పులు జరిగినా, ధనానికి ప్రాధాన్యానికీ మాత్రమే విలువనిస్తూ ఉంటే మీ సమస్యలూ ఎన్నివేల సంవత్సరాలయినా తరవుగాక తరవు గంభీరమైన స్వరంతో చెప్పి వెళ్ళిపోతూ ఏదో గుర్తొచ్చిన వాడిలా వెనక్కి తిరిగి మళ్ళీ అన్నాడు ఆదిత్య అయినా నేను నకు కాబట్టి యాభైవేలు కట్నం అని అన్నానే కాని మరేపిల్లనయినా సరే కట్నం లేకుండా చేసుకోటానికి నేను సిద్ధం చెప్పి వెళ్ళి పోయాడు ఆదిత్య

మౌనంగా బయటికి నడిచింది సుమిత్ర

వారం తిరక్కుండానే సుమిత్రా వెడ్స్ ప్రభాకర్ అన్న వెడ్డింగ్ కార్డ్ అందుకున్నాడు ఆదిత్య □